



వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వినుకొండ: పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హోమం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 588.50 అడుగులకు చేరింది. ఇది 307.5790 టీఎంసీలకు సమానం.



దుర్గమ్మకు కానుకలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్ర కీలాద్రిపై కనకదుర్గమ్మకు బోసాని బసవయ్య గురువారం 24.7 గ్రాముల బంగారు ముక్కు పుడక, బొట్టు, నత్తును సమర్పించారు.

న్యూస్‌రీల్

ఘనంగా భూ వరాహ స్వామి జయంతి వేడుకలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై భూ వరాహస్వామి జయంతి వేడుకలు రెండో రోజైన గురువారం వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో భూ వరాహస్వామి జయంతి మహోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించామని తెలిపారు. వివాహ యోగ్యత, దాంపత్యాభివృద్ధి, మంచి సంతానం పొందుటకు ఈ కల్యాణ మహోత్సవం దోహదపడుతుందని తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ జరిగిన పలు పీజీ కోర్సుల 4వ సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు గురువారం విడుదల చేశారు. సోషల్ వర్క్ 16కి 16మంది, ఎంఏ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌లో 10కి 10మంది, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులో 21కి 18 మంది, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ హార్టీకల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్‌లో 16 మందికి 11మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను 18లోగా ఒక్కొక్క పేపరుకు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190 చెల్లించాలని ఆయన సూచించారు.

9,10 తేదీల్లో రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జూడో చాంపియన్‌షిప్ 2025–26 పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరి నాయుడు తెలిపారు. గురువారం స్థానిక జేకేసి కళాశాల రోడ్డులో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, శ్రీహరి నాయుడు, గుంటూరు జిల్లా జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, పల్నాడు జూడో అసోసియేషన్ అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వరరావులు ఆవిష్కరించారు. శ్రీహరి నాయుడు మాట్లాడుతూ పెద పరిమిలోని ముప్పా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు.

వెలుగులోకి రేషను డీలర్ మోసం

దూరం విషయంలో అబద్ధాలు చెప్పి బియ్యం పాయింట్‌కు అనుమతి

తాడికొండ: గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అధికారమే అండగా డీలర్ల దందా' కథనంతో అధికారులు తర్జనభర్జన పడ్డారు. ఎట్టకేలకు నింద తమపై వేసుకోకుండా హడావుడిగా ఆర్డీవో జారీ చేసిన సిఫార్సు లేఖను వెలుగులోకి తీసుకొచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారు. ఒకే డీలరుకు రెండో పాయింట్ కేటాయించేందుకు చెప్పిన కారణాలు చూసి సాటి డీలర్లే ముక్కున వేలేసుకుంటున్నారు. అర కిలోమీటరు లేని దూరానికి ఒకటిన్నర కిలోమీటరుగా చూపిస్తూ రెండో పాయింట్ ఏర్పాటుకు అనుమతులిచ్చారు. కాలనీకి కేవలం 200 మీటర్లలోపు దూరంలో ఉన్న డీలరును పాడుబడిన భవనంలోకి వెళ్లి తేనే సరుకు కేటాయిస్తామంటూ దబాయించి తరిమేయడం మరో అంశం. ఆ పాయింట్ ఏ ఇంటివద్ద నిర్వహించాలి అనే డోర్ నంబర్ లేదా ఇతర అడ్రస్సు ఏమీ పొందుపరచక పోవడం చూస్తుంటే సదరు డీలరుపై ఎంత ప్రేమో అర్థం అవుతోంది. ఎక్కడైనా బియ్యం తీసుకునే ఎనీ వేర్ విధానం అందుబాటులో ఉంది. ప్రజలు తమ ఇష్టం వచ్చిన దగ్గర సరుకులు తెచ్చుకుంటున్నారు. అయినా రెండో పాయింట్ అవసరం ఇప్పుడేమొచ్చింది అంటూ అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాయింట్ రద్దు చేసి, డీలర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముందుకు సాగులేక..!

- జిల్లాలో భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం
- 5,390 హెక్టార్ల వరకు తగ్గొచ్చని వ్యవసాయ శాఖ అంచనా
- అందుబాటులో నీరున్నా పంట వేయడానికి ఆసక్తి చూపని రైతన్నలు
- గత ఏడాది ఇప్పటికే 89 శాతం పంటలు
- ప్రస్తుతం 47 శాతమే సాగు చేసిన వైనం
- ఏ పంట వేసినా తప్పని భారీ నష్టాలతో కర్షకులకు గడ్డుకాలం
- కూటమి సర్కార్ మోసపూరిత వైఖరిపై తీవ్ర ఆగ్రహం

కూటమి ప్రభుత్వ దగాతో సాగుకు అన్నదాతల వెనుకడుగు

కృష్ణమ్మ నీరు అందుబాటులో ఉన్నా రైతుల్లో నిర్లిప్తత నెలకొంది. నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం జలాశయాలు పూర్తిగా నిండినా.. సాగుపై ఆసక్తి చూపడం లేదు. అన్నదాతలు అయోమయంలో కూరుకుపోయారు. పెట్టుబడులు భారీగా పెరగడంతోపాటు దాదాపు ఏ పంట వేసినా కూటమి ప్రభుత్వం వచ్చాక గిట్టుబాటు ధరలేక భారీ నష్టాలు తప్పకపోవడమే ఈ దుస్థితి కారణం.



రైతు దున్నుతున్న ఓ పొలం పక్కన సాగు పనులు మొదలు కాని పొలాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలో గత ఏడాది కంటే ప్రస్తుతం 5,390 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 93,924 హెక్టార్లుగా ఉంది. ఇప్పుడు 88,534 హెక్టార్లకే పరిమితం కానుంది. గత ఏడాది ఈ సమయానికి 82,292 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇప్పుడు కేవలం 37,204 హెక్టార్లలోనే పంటలు వేశారు. ఒక్క కొల్లిపర మండలం తప్ప ఏ మండలంలోనూ సాగు ఆశాజనకంగా లేదు. ఉద్యాన పంటల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది.

ఇదీ పంటల పరిస్థితి...

- వరి విషయానికి వస్తే గత ఏడాది 63,733 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా.. ఆగస్టు మొదటి వారానికి 56,789 హెక్టార్లలో పంట వేశారు. అదే ఈ ఏడాది చూస్తే 61,257 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేయగా... ఇప్పటి వరకు 29 వేల హెక్టార్లలో మాత్రమే సాగైంది. అంటే 47 శాతం మాత్రమే పంట వేశారు.
- జిల్లాలో 3,061 హెక్టార్లలో కందులు, మినుములు, పెసర, శనగలు వేస్తారని అంచనా వేశారు. కేవలం 324 హెక్టార్లలోనే సాగు చేశారు. అది కూడా 319 హెక్టార్లలో మినుములు వేశారు.

జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు సాధారణ విస్తీర్ణం వివరాలు

పంట రకం	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	63,000
పత్తి	24,000
పసుపు	4,000
పండ్ల తోటలు	3,590
మినుము	3,122
కూరగాయలు	1,947
పూల తోటలు	437
నువ్వులు	28
జూట్	20
చెరకు	10
మొత్తం	1.15 లక్షలు

- పత్తి విస్తీర్ణం కూడా గణనీయంగా పడిపోయింది. గత ఏడాది ఇదే సమయానికి 21,842 హెక్టార్లలో సాగు చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకూ 7,715 హెక్టార్లలో మాత్రమే సాగైంది.

ఏ పంట వేసినా కన్నీరే

గత ఏడాది వరితోపాటు మిర్చి, పొగాకు, పత్తి, పసుపు, కందులు... ఇలా ఏ పంట వేసినా కూటమి సర్కార్ తీరుతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. మిర్చి రైతులు దాదాపు ఎకరానికి రూ.లక్షకుపైగా నష్టపోతే, మిగిలిన పంటలు వేసిన వారికీ భారీగా నష్టం తప్పలేదు. వరి కోతకు వచ్చే సమయానికి భారీ వర్షాలకు పంటలు తడిచిపోగా, ప్రభుత్వం కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెట్టింది. వ్యాపారులు ధరలు తగ్గించేసి రైతులను దోచుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పంటలు వేయడానికి రైతులు సాహసించని పరిస్థితులు నెలకొన్నాయి.

'రియల్ వ్యాపారి'గా ప్రభుత్వం

మరోవైపు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంట పొలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయి. ప్రభుత్వం సమీకరించిన భూమి వేల ఎకరాలు ఉంది. ఈ నేపథ్యంలో తుళ్లూరు, తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు రూరల్, వట్టిచెరుకూరు, పెదకాకాని మండలాల్లో చాలా మంది రైతులు వ్యవసాయం నుంచి దూరంగా వెళ్లిపోయారు. తమ పొలాలను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో గుంటూరు జిల్లాలో పంటల విస్తీర్ణం గణనీయంగా పడిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వైన్‌షాపుల వద్దే పర్మిట్ రూము పెట్టుకుని అక్కడే మందుబాబులకు మద్యం తాగే ఏర్పాట్లు అధికారికంగా చేసుకోవచ్చుని కూటమి ప్రభుత్వం 'గేట్లు' ఎత్తేసింది. దీనికి ఏకంగా రాష్ట్ర కేబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ప్రజారోగ్యం కంటే తమకు ఆదాయమే ముఖ్యమని సీఎం చంద్రబాబు మరోసారి తన వైఖరిని చాటుకున్నారు.

వైన్స్‌లోనూ 'గేట్లు' ఎత్తేశారు!

- ఇక పర్మిట్ రూమ్‌లకు కూడా అనుమతి
- మద్యం షాపుల వద్ద తాగేందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- జిల్లా వ్యాప్తంగా 140 వైన్ షాపుల్లో అమలయ్యే అవకాశం
- బార్ అండ్ రెస్టారెంట్ల అనుమతుల ప్రక్రియ పూర్తయ్యాక అమలు



గుంటూరు నగరంలోని ఓ వైన్ షాప్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో మద్యం ఏరులై పారిస్తోంది. మద్యమే ఆదాయ వనరుగా చూస్తూ ఎడాపెడా ప్రజలతో తాగించేందుకు కొత్తగా పర్మిట్ రూములు సిద్ధం చేస్తోంది. ఇందుకు గాను లైసెన్సీల వద్ద నుంచి రూ.5 లక్షల నుంచి రూ.7.50 లక్షల వరకు వసూలు చేసేందుకు నిర్ణయించింది.

తాగినోళ్లకు తాగినంత..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్వహించిన మద్యం దుకాణాలను కూటమి సర్కారు వచ్చాక రద్దు చేసింది. వాటి స్థానంలో ప్రైవేట్ వ్యక్తులు వైన్ షాపులు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించింది. జిల్లాలో 140 వైన్ షాపులకు అనుమతులు మంజూరు చేసింది. వీటి వద్ద అనధికారికంగా పర్మిట్ రూములు నిర్వహిస్తున్నారు. వాటిలో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నారు. వైన్ షాపు నిర్వాహకులు, నాయకులు, ఎక్సైజ్ అధికారులు జేబులు నింపుకొంటున్నారు. ఈ నెలాఖారుకు ప్రస్తుతం బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించిన మద్యం పాలసీ పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీలోగా నూతన మద్యం పాలసీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందులో భాగంగా గీత కులాలకు పదిశాతం బార్ నిర్వహణలో అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రస్తుతం ఉన్న 99 బార్ అండ్ రెస్టారెంట్లకు మరో పది అదనంగా వచ్చే అవకాశం ఉంది. ఈ నెల 25వ తేదీలోగా కొత్త మద్యం పాలసీకి సంబంధించిన బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించి లాటరీ ప్రక్రియను పూర్తి చేసి సెప్టెంబర్ 1 నుంచి నిర్వహించుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ జరుగుతున్న సమయంలో వైన్ షాపులకు సంబంధించి పర్మిట్ రూములు నిర్వహించుకునేందుకు అధికారిక ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం. ఆదాయమే పరమావధిగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.

ఆదాయమే పరమావధిగా..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలో బీర్లు 26.08 లక్షల బాక్సులు, లిక్కర్ 11.84 లక్షల బాక్సులు అమ్మకాలు జరిగాయి. దీని వలన ప్రభుత్వానికి ఆదాయంగా రూ.2,010 కోట్లు సమాకూరింది. ఇప్పటి వరకు అనధికారికంగా నిర్వహించిన పర్మిట్ రూముల స్థానంలో అధికారికంగా నిర్వహణకు అనుమతి ఇస్తే ఇక మద్యం ఏరులై పారడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

రెడ్‌బుక్ పాలనకు

హైకోర్టు తీర్పు చెంపపెట్టు

బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అక్రమ కేసుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు కూటమి రెడ్‌బుక్ పాలనకు అడుగులకు మడుగులు ఒత్తుతున్న పోలీసులకు ఒక చెంపపెట్టు లాంటిదని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారు.. అనే దానికి తురకా కిషోర్ ఉదంతం ఒక ఉదాహరణ అని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా, పౌరహక్కులు నిలబెట్టేలా కిషోర్‌ను విడుదల చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వటం గొప్ప పరిణామం అన్నారు. పోలీసు వ్యవస్థ పొలిటికల్ బాస్‌ల చేతిలో కీలుబొమ్మల్లా మారిపోయిందని ధ్వజమెత్తారు. వాస్తవానికి తురకా కిషోర్‌ను 2022లో జరిగిన సంఘటనకు సంబంధించి అరెస్ట్ చేశాక, అనేక అక్రమ కేసులు బనాయించారన్నారు. కేవలం వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తి అనే దురుద్దేశంతో 210 రోజులకుపైగా జైల్లో పెట్టారని మండిపడ్డారు. కిషోర్‌ను మానసికంగా, శారీరకంగా వేధించారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో హైకోర్టు ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాపాడాలనే ఉద్దేశంతో చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని అన్నారు. సామాన్యుల హక్కులను కాలరాసే విధంగా అరాచక పాలన చేస్తున్న కూటమికి హైకోర్టు తీర్పు చెంప చెళ్లుమనిపించేలా ఉందన్నారు. అక్రమ అరెస్టులపై వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం బాధితుల పక్షాల అన్ని విధాలుగా పోరాడుతోందని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామన్నారు. జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి న్యాయమూర్తులు రిమాండ్ విధించేటప్పుడు రికార్డులు సరిగ్గా పరిశీలించటం లేదనే విషయాన్ని హైకోర్టు ఎత్తి చూపటం జరిగిందన్నారు.

సుప్రీంకోర్టు, హైకోర్టు గైడ్‌లైన్స్ పాటించాలి..

ఇప్పటికైనా ఆయా న్యాయమూర్తులు కేసు పూర్వాపరాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని, యాంత్రికంగా వ్యవహరించటం సరికాదన్నారు. సుప్రీం, హైకోర్టు గైడ్‌లైన్స్ పాటించాల్సిన బాధ్యత మెజిస్ట్రేట్‌లపై ఉందన్న విషయాన్ని తెలియజేస్తామన్నారు. ఏదో పోలీసులు తెచ్చారు.. రిమాండ్ విధిద్దాం.. అనే ధోరణిలో కాకుండా వాస్తవాలను పరిశీలించాలని విన్నవించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అండగా లీగల్ విభాగం ఉంటుందని, వారిని అన్ని విధాలుగా సహాయం అందజేస్తామన్నారు. తురకా కిషోర్‌పై ఇప్పటివరకు 18 అక్రమ కేసులు పెట్టారన్నారు. ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండదన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెనాలిలో విజిలెన్స్ అధికారుల దాడులు

- అనుమతిలేని వరి విత్తనాలు గుర్తింపు
- రూ.5,85,300 విలువైన విత్తనాలు సీజ్ చేసిన అధికారులు




తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెనాలిటౌన్: అనుమతిలేని విత్తనాలను తెలంగాణ రాష్ట్రం నుంచి తెచ్చి తెనాలి ప్రాంతంలో అమ్మకాలు జరుపుతున్న ఎరువులు, విత్తనాల షాపులపై గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి భారీగా వరి విత్తనాలను సీజ్ చేశారు. స్థానిక నందులపేటలోని వినాయక ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమతిలేని వరి విత్తనాలను తెలంగాణ నుంచి తెచ్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. విత్తనాల నాణ్యతను పరీక్ష నిమిత్తం శాంపిల్స్ సేకరించి, ల్యాబ్ టెస్టింగ్‌కు పంపిచారు. డెల్టా ప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తున్న వరిలో మేలు రకం విత్తనాలను రైతులకు అందివ్వాలన్న దృక్పథంతో వరుసగా తెనాలి పరిసర ప్రాంతంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. రైతులను మోసగించాలని చూస్తే సహించేది లేదని దుకాణదారులను హెచ్చరించారు. అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. దాడుల్లో విజిలెన్స్ అధికారి సీహెచ్.ఆదినారాయణ, ఇన్‌స్పెక్టర్లు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై అడ్డగోలు పెత్తనం

గుంటూరు అర్బన్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలపై సూపర్‌వైజర్లు, ఇతర అధికారుల అడ్డగోలు పెత్తనం ఎక్కువైంది. తమకు అనుకూలంగా ఉండే వారిని మిగతా కార్యకర్తల వద్దకు విజిట్‌ల పేరుతో పంపి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సాకుతో వారి పనులన్నీ తమతో చేయిస్తూ మానసికంగా హింసిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎంతో కొంత సమర్పించుకున్న వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



- తాము చేయాల్సిన పనులూ అప్పగిస్తున్న సూపర్‌వైజర్లు, పై అధికారులు
- అనుకూలంగా ఉండే సిబ్బందికి అనధికార సెలవులు మంజూరు
- విజిట్‌ల పేరుతో మిగతా వారిపై నిత్యం వేధింపులు
- గుంటూరు అర్బన్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు తప్పని కష్టాలు



ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం

నెహ్రూనగర్: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం) ద్వారా జరుగుతుంది. ఫోన్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో సూపర్‌వైజర్లు చేయాల్సిన పనిని కూడా తమకు నచ్చని అంగన్‌వాడీ కార్యకర్తలతో చేయిస్తున్నారు. దీంతో ప్రీ స్కూల్ నిర్వహణ సక్రమంగా లేదు. మరోవైపు అంగన్‌వాడీలు చేయాల్సిన విధుల్లో ఆలస్యమైతే మెమోలు ఇస్తున్నారు. గుంటూరు అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పదవీ విరమణ పొందిన స్థానాల్లో అక్కడ పనిచేస్తున్న ఆయాకు అర్హతలను బట్టి కార్యకర్తగా పదోన్నతి కల్పిస్తారు. ఇలా ఎవరైనా పొందితే రూ.1.50 లక్షలు వరకు ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేదంటే రోజూ విజిట్ల పేరుతో వేధిస్తున్నారు.

అదనపు భారంతో బెంబేలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలలో పది రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. వీటి నిర్వహణ కోసం కార్యకర్తపై రూ.1,500 నుంచి రూ. 2 వేల వరకు అదనపు భారం తప్పడం లేదని బాధితులు వాపోతున్నారు. ఆర్‌టీఐ విజిట్‌ల పేరుతో వచ్చే వారిని మేనేజ్ చేసేందుకు ప్రతి కేంద్రం నుంచి రూ.200 సమర్పించాలని అధికారులు సూచించడంతో ఆ మొత్తం కూడా వీరే ఇస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సరుకులు ఎండీఎం వాహనాల ద్వారా రేషన్ షాపు నుంచి సరఫరా అయ్యేవి. ఇప్పుడు రేషన్ షాపు నుంచి ఆటోలో ప్రత్యేకంగా తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని కార్యకర్తలు వాపోతున్నారు. తమకు ఇచ్చే రూ.11,500 జీతంలో ఇలా ఖర్చులు పోతే మిగిలేదేమీ ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం


ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. ప్రసూనను దీనిపై వివరణ కోరగా.. సరుకులను సూపర్‌వైజర్ తీసుకుంటున్న విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు. వివరాలు సమగ్రంగా పరిశీలించాక తప్పు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రసన్నం చేసుకుంటే అంతా ఓకే..

సూపర్‌వైజర్లను, ఆపై అధికారులను ప్రసన్నం చేసుకుంటే చాలు కార్యకర్తలకు అనధికార సెలవులు ఇస్తున్నారు. దీంతోపాటు ఆయా కేంద్రాలకు విజిట్‌కు వెళ్లడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త విదేశాలకు వెళ్లినట్లు సమాచారం. అధికారుల అండదండలు ఉండటంతో మేనేజ్ చేస్తున్నారని తెలిసింది. ఇటీవల అర్బన్ పరిధిలోని ఓ సూపర్‌వైజర్ బయట సరుకులు తేవాలని ఓ అంగన్‌వాడీ కార్యకర్త భర్తను బెదిరించారు. ఆయన ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తుండటంతో ఫోన్ చేసి కావాల్సిన వస్తువులను తెప్పించుకున్నట్లు సమాచారం. నెల నెలా ఇలా చేస్తుండటంతో విసిగిపోయిన ఆయన కొద్ది నెలల క్రితం అర్బన్ సీడీపీఓ కార్యాలయం వద్దకు వచ్చి అధికారులకు ఫిర్యాదు చేశారు.

9 నుంచి గుంటూరులో ట్రాఫిక్ మళ్లింపులు

శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత దృష్ట్యా నిర్ణయం



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత పనుల దృష్ట్యా ఈ నెల 9 వ తేదీ నుంచి ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగర పరిధిలో రాకపోకలు సాగించేందుకు ముందస్తు ప్రయాణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రజల సౌకర్యార్థం పలు తాత్కాలిక మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. అందరూ నిబంధనలను పాటించి సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

వివిధ మార్గాల్లో మళ్లింపులు ఇలా..

- అమరావతి రోడ్ నుంచి మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలను చిల్లీస్ పాయింట్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్ మార్గంలో మళ్లిస్తారు.
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు వెళ్లే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇకనుంచి అరండల్‌పేట, పొట్టిశ్రీరాములునగర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు లేదా బ్రాడీపేట, కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మార్గాల్లో వెళ్లాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంలో కూడా ఈ మార్గం మీదుగా వెళ్లాలి.
- ఎంటీబీ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలు (పాఠశాల, కళాశాల బస్‌లు సహా) రమేష్ హాస్పిటల్ నుంచి కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదగా ప్రయాణించాలి.
- కోబాల్ట్‌పేట, కృష్ణనగర్, చంద్రమౌళినగర్, బృందావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం ప్రాంతాల నుంచి మార్కెట్ వైపు వచ్చే వాహనాలన్నీ పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ రోడ్ లేదా బ్రాడీపేట, కంకరగుంట రైల్వే అండర్ బ్రిడ్జి, కలెక్టర్ కార్యాలయం రోడ్డు, నగరంపాలెం మీదగా వెళ్లాల్సి ఉంటుంది.
- పట్టాభిపురం నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్) వైపు వెళ్లే వారు కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి, ఎంటీబీ సెంటర్, ప్రభుత్వ మహిళా కళాశాల (ఉమెన్స్ కాలేజ్) వైపు నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు మీదగా వెళ్లాలి.
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలు చిల్లీస్, ఇన్నర్‌రింగ్ రోడ్, ఆటోనగర్, బస్టాండ్ లేదా కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మార్గాలను ఉపయోగించాలని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,400** గరిష్ఠం : రూ. **2,200**

మోడల్ ధర రూ. **1,800**

మిర్చి

యార్డు సమాచారం (గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	52,137
అమ్మకాలు	59,986
నిల్వ	5,178

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,200
273	10,500-12,800
341	10,000-14,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-14,700
4848	10,000-12,500
సూపర్ -10	10,000- 13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,800
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,000 - 12,300
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **549**

కొమ్ములు : **381** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,200	**10,950**	**10,500**

కాయలు : **170** బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,090	**10,950**	**10,325**

మొత్తం అమ్మకాలు : **411.750** క్వింటాళ్లు

చేనేత రంగాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం



చేనేత సూరీడు ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: మనదేశంలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగంపై ఆధారపడి జీవించే కుటుంబాలు అధికమని, అలాంటి చేనేత రంగాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సం సందర్భంగా నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రగడ కోటయ్య చిత్రపటానికి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమంతరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో చేనేత షెడ్లు నిర్మించి 1500 కుటుంబాలకు ఉపాధి కల్పించడమే కాక చేనేత భవనం నిర్మించామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నల బాధలు గమనించి ఏడాదికి రూ.24 వేలు అందజేశారన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని విస్మరించిందని, ఫలితంగా కొన్ని కుటుంబాలు పూట గడవని పరిస్థితిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మంత్రి నారా లోకేష్ కార్మికులను ఆదుకోవాలని కోరారు. పలువురు చేనేత కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, లీగల్ సెల్ నాయకులు కొసనం శ్రీనివాసరావు, పట్టణ గౌరవ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, చేనేత విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు పూజాల మనోహర్, జిల్లా కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, చేనేత విభాగం నాయకులు ఆకురాతి శివభాస్కరరావు, గుంటి నవీన్, జిల్లా యాక్టివిటీ సభ్యురాలు మల్లవరపు సుధారాణి, రూరల్, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు మాతంగి బాబు, శుభకర్, నిర్మల, ఫిరోజ్ మాబు పాల్గొన్నారు.

రాజధానిలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలి

- గతంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- పూలింగ్‌కు పొలాలిచ్చిన రైతులకు వెంటనే ప్లాట్లు కేటాయించాలి
- రైతులను ఇబ్బంది పెట్టవద్దు
- వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: రాజధాని గ్రామాల్లో రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉందని, రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయకపోతే ఉద్యమాలు తప్పవని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. గురువారం రాత్రి రాజధాని గ్రామం పెనుమాకలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రాజధాని ప్రాంతంలో పూలింగ్‌కు పొలాలను ఇచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో ప్లాట్లు కేటాయించలేదని, ప్లాట్లు కేటాయించని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పలురకాల వాణిజ్య పంటలు పండించుకుంటూ వారి పిల్లల భవిష్యత్తు గురించి కలలు కన్నారని, గతంలో అధికారంలో ఉన్న టీడీపీ రాజధాని పేరుతో పంటలు పండించే భూములను నాశనం చేసి, రైతులను బెదిరించి ల్యాండ్ పూలింగ్ కింద భూములు తీసుకున్నారని అన్నారు. ఆ భూములకు సంబంధించి ఎలాంటి ప్లాట్లు పూర్తిస్థాయిలో రైతులకు కేటాయించలేదన్నారు. మూడు సంవత్సరాల్లో ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారం కోల్పోయిన తరువాత, మళ్లీ అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం అయినా ఒక్క ప్లాట్‌ను కూడా తట్టి మట్టి వేయలేదు. రైతులు వారి పొలాలకు ధరలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇచ్చిన పంట పొలాలే అభివృద్ధికి నోచుకోలేదు. మరో 40 వేల ఎకరాలు సేకరిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే రైతులు స్థలాలకు ధరలు లేక, ఇబ్బంది పడుతున్నారు. రాజధానిలో కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా భూములు ఇచ్చి, వారి వద్ద నుంచి భారీగా ముడుపులు తీసుకుని రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మరో రైతు ఉద్యమం చేయబోతున్నామని, దానికి రైతులందరూ కలిసి కట్టుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈప్రాంతాల్లో కొంత మంది రాజధాని పేరుతో రైతులను బెదిరించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మంగళగిరి నియోజకవర్గంలో అనవాయితీ లేదని, బెదిరించే వారికి వైఎస్సార్‌సీపీ తరుపున హెచ్చరిక జారీ చేస్తున్నామని, భవిష్యత్‌లో వారు ఎక్కడ ఉన్నా వారి సంగతి తేలుస్తామన్నారు. చట్టాలు ఎవరికీ చుట్టాలు కాదన్నారు.

అధికారిక సమావేశం.. ఆయనకు ఏం పని?

- కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమీక్షలో తాడికొండ షాడో బత్తుల హాజరుపై అధికారులు విస్మయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



సమీక్షలో ముందు వరుసలో కూర్చున్న షాడో బత్తుల

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో షాడో పెత్తనంపై అందరూ విస్మయం చెందుతున్నారు. పార్టీ కార్యాలయంలో చెలాయిస్తున్నాడు సరే ఇక్కడ కూడా ఇతని ఆదిపత్యం మాకు తప్పదా అంటూ పెదవి విరుస్తున్నారు తాడికొండ నియోజకవర్గ అధికారులు, పార్టీ నాయకులు. టీడీపీ సిఫార్సు లేఖలు, ట్రాన్స్‌ఫర్‌లు, అధికారులు చేయాల్సిన విధులు, బడ్జెట్ కేటాయింపులు అన్నింటా తానే అయి వ్యవహరిస్తున్న సదరు షాడో బత్తుల నిన్న మొన్నటి వరకు ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమీక్షలకే హాజరై హుకుం జారీ చేసేవాడు. కానీ ఇప్పుడు అది కాస్తా ముదిరి ఇప్పుడు నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమీక్షలో కూడా ఆయన గారి ప్రసన్నం అధికారులకు తప్పలేదు. సదరు షాడో సమీక్షకు హాజరు కాకూడదని తెలిసినా నేరుగా వచ్చి ముందు వరుసలో హాజరై ఆశీనుడయ్యారు. వచ్చిన అధికారులు కూడా చేసేదేమీ లేక ఆయనకు వంగి వంగి నమస్కరించడం మనకి ఇక్కడ కూడా ఈ ఖర్మ తప్పదా ఇదేమి చోద్యం అంటూ చెవులు కొరుక్కోవడం తప్పలేదు. ఇతగాడి వ్యవహార శైలిపై అధికార పార్టీలోనే పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల టీడీపీకి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో ఓ మెస్సేజ్ హల్‌చల్ చేసింది దాని పర్యావసానం ఏమిటంటే బ్యాంకులో గుమాస్తాగా ప్రస్థానం మొదలెట్టి సినిమా లెక్క ఇతను నియోజకవర్గం కాకున్నా నియోజకవర్గం మీద పడి రెచ్చిపోతున్నాడనే విమర్శలు లేకపోలేదు. . అతి తక్కువ కాలంలో వందల కోట్ల పోగేసిన ఈ రాజకీయ బ్రోకర్ చేసే ఆగడాలలో ఇది 0.01 శాతం మాత్రమే ఇతని చిట్టా మొత్తం ఆధారాలతో సహా ఎప్పటికప్పుడు లోకేష్ గారి టీమ్ ద్వారా లోకేష్‌కి చేరుతూనే ఉంది. ఇతనికి తెలియకుండానే ఇతని దగ్గర లోకేష్ గారు మనుష లును సైలెంట్‌గా ప్రవేశ పెట్టడం ఇతని కదలికలను ఎప్పటికప్పుడు రికార్డెడ్‌గా కేంద్ర కార్యాలయానికి చేరవేయడం నిరంతరంగా జరుగుతుంది. ప్రస్తుతం ఇతని కదలికల మీద 24 గంటల నిఘా ఉంది.

ఇతని వ్యక్తిగత ప్రయోజనాల కోసం పచ్చగా ఉండే పల్లెల్లో పార్టీని అడ్డగోలుగా గ్రూపులుగా విడగొట్టి ఆ గ్రూపులకు పార్టీ పదవులు, గ్రామాల్లోని కాంట్రాక్టు పనులను అమ్ముకుంటున్నాడు అని పూర్తి సమాచార పలు వివాదాస్పద వ్యవహారాలను ఉదహరిస్తూ ఓ మెస్సేజ్ భారీగా హల్‌చల్ చేసింది. ఇంతా జరుగుతున్నా ఇతగాడిని పక్కన పెట్టకపోగా పక్కనే కూర్చోబెట్టుకోవడం వెనుక అంతరం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదనేది వాదన.

నీరజ్ చోప్రాను ఆదర్శంగా తీసుకోవాలి



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఒలింపిక్స్‌లో బంగారు పతకం గెలుచుకున్న నీరజ్ చోప్రాను అథ్లెట్స్ ఆదర్శంగా తీసుకోవాలని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా చైర్మన్, సీనియర్ అథ్లెట్ జి.శేషయ్య తెలిపారు. గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి అండర్-14, 16, 18, 20 బాల బాలికలతోపాటు యువతీ యువకుల జావెలిన్ త్రో పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. శేషయ్య మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించనందుకుగాను భారత ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్ట్ 7న జాతీయ జావెలిన్ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అతి సామాన్య కుటుంబంలో పుట్టిన నీరజ్ చోప్రా విజయ రహస్యాలను అథ్లెట్స్ సాధన చేయాలన్నారు. అనంతరం శేషయ్య, జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కోచ్ రవి, కె.రాజు, సుబ్రమణ్యం, చిన్న, నాని పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని మహిళపై దాడి

తాడేపల్లిరూరల్: స్థానిక ఇప్పటంలో అద్దె చెల్లించే విషయంలో ఆలస్యం కావడంతో జనసేన నాయకుడి తమ్ముడు ఓ మహిళపై దాడిచేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఖాజావలి కథనం ప్రకారం.. కుంచనపల్లిలో నివాసముండే అమ్మిశెట్టి సురేష్ అనే యువకుడు తనకున్న నివాసాన్ని హాస్టల్ నిర్వహించుకునేందుకు ఆదే గ్రామానికి చెందిన శ్రీలత అనే మహిళకు అద్దెకు ఇచ్చాడు. నెలకు రూ. 50 వేలు అద్దె చెల్లించాల్సి ఉండగా శ్రీలత రూ. 30 వేలు ఇచ్చిందని, రూ. 20 వేలు చెల్లించే విషయంలో సురేష్, శ్రీలతకు రెండు మూడుసార్లు చిన్నపాటి వాదనలు జరిగాయి. బుధవారం రాత్రి శ్రీలత ఇప్పటంలో ఉన్నానని, రూ. 20 వేలు ఇస్తానని చెప్పింది. ఇదే విషయమై సురేష్ మరో ఇద్దరితో కలసి ఇప్పటం వెళ్లి వాదనకు దిగాడు. అక్కడ ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో శ్రీలతపై సురేష్‌తో పాటు మరో ఇద్దరు దాడి చేశారు. ఈ విషయమై శ్రీలత పోలీసులకు స్వయంగా ఫిర్యాదు చేయడంతో దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఇదిలా ఉంటే అమ్మిశెట్టి సురేష్ అన్నయ్య జనసేన నాయకుడు కావడంతో శ్రీలత తను కేసు విత్‌డ్రా చేసుకోమని ఒత్తిడి తీసుకువస్తున్నారు. తమపై ఎటువంటి ఒత్తిడి తెచ్చినా మంత్రి లోకేష్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని వారి బంధువులు వెల్లడించారు.

నా బిడ్డను అన్యాయంగా తీసుకెళ్లారయ్యా

పోలీసుల తీరుపై ఘొల్లుమన్న తండ్రి



వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి తండ్రి మల్లి

పట్నంబజారు: అర్ధరాత్రి .. రెండు గంటల సమయం.. పోలీసులు ఇంటి గోడలు దూకి దబదబా తలుపులు కొట్టారు.. దూకుడుగా ఇంట్లోకి ప్రవేశించి బీటెక్ చదువుతున్న విద్యార్థిని కాలర్ పట్టుకుని లాక్కుని బయటకు వెళ్లారు.... ఆపైన చోరీ చేసినట్లుగా ఇళ్లంతా వెతికారు.. ఇదంతా బయటి వ్యక్తులు చేసిన పని కాదు.. సాక్షాత్తు పోలీసులు వ్యవహరించిన తీరిది. దీనిపై విద్యార్థి తండ్రి దేవరకొండ మల్లి వివరాలు 'సాక్షి'కి వివరించారు. ఓబులనాయుడుపాలెంలో నివాసం ఉండే దేవరకొండ మల్లి తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్నాడు. అతని కుమారుడు రాజమనోహర్ బీటెక్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో ఈస్ట్ సబ్ డివిజన్ పోలీసులమంటూ రెండు జీవుల్లో వచ్చిన పోలీసులు బలవంతంగా విద్యార్థి రాజ మనోహర్‌ను లాక్కొని వెళ్లారు. కుటుంబ సభ్యులు అడ్డుకున్నప్పటికీ వారిని పక్కకు నెట్టి విద్యార్థిని తీసుకెళ్లారు. లాలాపేట పోలీసు స్టేషన్ అని చెప్పి తీసుకెళ్లినట్లు తెలిసింది. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు లాలాపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లగా, తాము ఎవరిని తీసుకు రాలేదని తెలిపారు. కొత్తపేట పోలీసు తీసుకెళ్లినట్లు ధృవీకరించారు. పలుమార్లు పోలీసులు కొత్తపేట, లాలాపేట అంటూ సదరు విద్యార్థి తల్లిదండ్రులను తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు తిప్పినట్లు బాధితులు వాపోయారు. తన కుమారుడిని ఏ కేసులో తీసుకెళ్లారు, ఎందుకు తీసుకెళ్లారనే అంశంపై ఎలాంటి వివరణ తమకు చెప్పలేదన్నారు. తమ కుమారుడు హ్యాకింగ్ చేశాడని చెబుతున్నారని, తన కుమారుడు అలాంటి వాడు కాదని చెప్పారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ఒక ప్రజాప్రతినిధి గురించి పెద్దఎత్తున హల్‌చల్ అయిన విషయం విదితమే. ఈక్రమంలో ఆ కేసులో విద్యార్థి పోస్టింగ్ పెట్టాడనే నెపంతో తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు విద్యార్థి పోస్టింగ్ పెట్టాడా లేదా అనేది తెలియాల్సి ఉంది. దీనిపై కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య చౌదరిని వివరణ కోరగా, కేసు విచారణలో ఉందని, మీడియాకు వివరాలు వెల్లడించలేమని తెలిపారు.

విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటు చేసుకోండి

తెనాలిఅర్బన్: నేషనల్ క్యాడెట్ కోర్ విస్తరణలో భాగంగా 22వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ యూనిట్‌లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయని, కమాండింగ్ ఆఫీసర్ ఆకుల ఉదయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాలలు తెనాలి ఐతానగర్‌లోని 22వ ఆంధ్రా బెటాలియన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సంప్రదించిన విద్యాసంస్థల్లో వెంటనే ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అన్ని విద్యాసంస్థలు ఉపయోగించుకోవాలని సూచించారు.

కోర్టు తీర్పుపై ఉపాధ్యాయ నేతల హర్షం



కేసు కొట్టివేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్ : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో ఉపాధ్యాయులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై నమోదైన కేసు తీర్పు గురువారం ఉపాధ్యాయులకు అనుకూలంగా రావడంతో హర్షం వ్యక్తం చేశారు. జనవరి 31, 2019 సంవత్సరంలో ఏపీసీపీ ఎస్ఐఏ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ పిలుపు ఇచ్చారు. అప్పట్లో తాడేపల్లి పోలీసులు 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమో దు చేశారు. ఆ కేసులో కర్నూలుకు చెందిన ఏడుగురు, విజయనగరానికి చెందిన ఆరుగురు, అనంతపురానికి చెందిన ముగ్గురుపై కేసు నమోదైంది. మంగళగిరి న్యాయస్థానం ఉపాధ్యాయులపై అప్ప టి ప్రభుత్వం మోపిన కేసు కొట్టివేయడంతోఅధ్యక్ష కార్యదర్శులు బాజీ పఠాన్, కరీమ్ రాజేశ్వరరావు కోర్టు తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేస్తూ న్యాయం గెలిచిందని అన్నారు. తమ న్యాయమైన కోర్కెల కోసం శాంతియుతంగా ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపడితే తాడేపల్లి పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి 17 మంది కోర్టు చుట్టూ తిరుగుతున్నారన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సీబీ వెంకట రమణారెడ్డి (కర్నూలు), ప్రేమనాధ రెడ్డి (అనంతపురం), జె. రమేష్ (కర్నూలు) కులాయప్ప (అనంతపురం), అజయ్ (విజయనగరం) తవిడి నాయుడు (విజయనగరం), సత్యనారాయణ (గుంటూరు) ఉన్నారు.

అవయవదానంతో ఐదుగురికి నూతన జీవితం



బలరామకృష్ణయ్య సతీమణి కృష్ణదుర్గను సన్మానిస్తున్న డాక్టర్ యశస్వీ రమణ

గుంటూరు మెడికల్: తాను మరణిస్తూ అవయవదానంతో మరో ఐదుగురికి నూతన జీవితాన్ని ప్రసాదించాడు. ఇంటి పెద్ద చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు పెద్ద మనస్సు చేసుకుని అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా సత్కరించారు. వివరాల్లోకి వెళితే... బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం అద్దేపల్లి గ్రామానికి చెందిన కనగాల బాల రామకృష్ణ (59) ఐదేళ్లుగా గుంటూరు కృష్ణనగర్‌లో నివసిస్తున్నారు. ఆగస్టు 3న గుంటూరు గుజ్జనగుండ్ల నుంచి పట్టాభిపురం వైపు సైకిల్‌పై వెళుతున్నాడు. కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు తరలించారు. అత్యవసర చికిత్స పొందుతూ ఈనెల 7న బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించి, చికిత్స అందిస్తున్న న్యూరాలజీ చీఫ్ డాక్టర్ కుమారవేల్ విషయాన్ని కుటుంబసభ్యులకు విషయం తెలిపారు. బాలరామకృష్ణ కుటుంబ సభ్యులకు ఆసుపత్రి వారు జీవన్‌ధాన్ గురించి తెలియజేయడంతో, అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులు గురువారం ఆపరేషన్ చేసి బాలరామకృష్ణ శరీర అవయవాలను ఇతరులకు అమర్చి నూతన జీవితాలను ప్రసాదించారు. గుంటూరు రమేష్ హాస్పటల్‌లో లివర్, కిడ్నీ సమస్యలతో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురు రోగులకు బాలరామకృష్ణ శరీర అవయవాలను ఆపరేషన్ ద్వారా అమర్చి ఇరువురికి నూతన జీవితాన్ని ప్రసాదించారు. మరో కిడ్నీ, రెండు నేత్రాలను విజయవాడ విజయ్ హాస్పటల్, తాడిగడప ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించి, అక్కడ చికిత్స పొందుతున్న వారికి అమర్చి నూతన జీవితాన్ని ప్రసాదించారు.

సూపరింటెండెంట్ అభినందన

జీవన్‌దాన్ ట్రస్ట్ తరుపున గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ గురువారం బాలరామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి అభినందించారు. త్వరలో ప్రభుత్వం అవయవదానం చేసిన వారిని గుర్తించి తగినవిధంగా సహకరిస్తుందని వెల్లడించారు. జీవన్‌ధాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10 వేలు కుటుంసభ్యులకు అందించారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ విషాద సమయంలో కూడా ఆ కుటుంబం తీసుకున్న అవయవదాన నిర్ణయం, నిజంగా విలక్షణమైన మానవీయ చింతనకు ప్రతిబింబమన్నారు.

అంతర్జాతీయ సదస్సులో గుర్తింపు అభినందనీయం



పురస్కారం అందిస్తున్న వీసీ

పెదకాకాని(ఏఎన్‌యూ): అంతర్జాతీయ సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ హిందీ విభాగ సహాయ సమన్వయకర్త డాక్టర్ కె.శ్రీకృష్ణ పురస్కారం పొందడం అభినందనీయమని యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. పంజాబీ సభ మాస్కో(రష్యా), నేపాల్ సంస్కృత విద్యాలయ వాల్మీకీ విద్యాపీఠం(నేపాల్ రాజధాని ఖాట్మండ్) సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ కె.శ్రీకృష్ణకు విద్యాశ్రీ సమ్మాన్ 2025 పురస్కారం లభించింది. గురువారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు తన ఛాంబర్‌లో డాక్టర్ శ్రీకృష్ణను అభినందించారు. వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులో శ్రీకృష్ణ సమర్పించిన పరిశోధన పత్రానికి మంచి గుర్తింపు రావడం అభినందనీయమన్నారు.

జీజీహెచ్ ఏడీ పెన్షన్ పత్రాలు నిలిపివేత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సి.హెచ్.నాగేశ్వరరావు పెన్షన్ పత్రాలను రాష్ట్ర కార్యాలయానికి పంపించకుండా గురువారం ఆసుపత్రి అధికారులు నిలుపుదల చేశారు. జీజీహెచ్ ఏడీ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. సాధారణంగా ఉద్యోగ విరమణ ఆరునెలలముందుగానే ప్రతి ఒక్కరూ తమ పెన్షన్ పత్రాలను సిద్ధం చేసుకుని, అనుమతి కోసం రాష్ట్రకార్యాలయానికి పంపిస్తారు. కొంతకాలంగా డెప్యూటీ డైరెక్టర్ (డీడీ) పదోన్నతి వస్తుందని, ఎదురు చూస్తున్న ఏడీ నాగేశ్వరరావు పెన్షన్ పత్రాలను పంపించకుండా వేచి ఉన్నారు. చివరి నెల ఉద్యోగ విరమణ సమయం రావడంతో పెన్షన్ పత్రాలు సిద్ధం చేసుకున్నా, ఆసుపత్రి అధికారులు వాటిని నిలుపుదల చేశారు.

అందుకే నిలిపివేశారు

ఆసుపత్రి ఏడీగా పనిచేస్తున్న నాగేశ్వరరావుపై గతంలో పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయాలంటూ రాష్ట్ర ఉన్నతాధికారులు గత ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీచేశారు. అయినప్పటికీ ఆసుపత్రి ఉద్యోగులు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేయకుండా ఇచ్చారంటూ, ఈవిషయంపై జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు వెళ్లింది. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాలు, అనుసరించి సమగ్రంగా విచారణ చేసి, పెన్షన్ పత్రాలు పంపించే ఆలోచనలో ఆసుపత్రి అధికారులు నిలుపుదల చేశారని సమాచారం. కాగా కోర్టుకు వెళ్లి తనపై వచ్చిన క్రమశిక్షణ చర్యలపై స్టే తెచ్చుకోవడం వల్లే తనకు ఇంక్రిమెంట్లు ఇచ్చారంటూ ఏడీ నాగేశ్వరరావు మీడియాకు వివరణ ఇచ్చారు.

ఒత్తిడి చేస్తున్నారంటూ ఫిర్యాదు

పెన్షన్ పత్రాలను సంబంధిత క్లర్క్ ద్వారా కాకుండా ఇతరుల ద్వారా సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపించాలంటూ ఏడీ ఒత్తిడి చేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలో సైతం ఇంక్రిమెంట్లు సంబంధిత ఉద్యోగి కాకుండా వేరే ఉద్యోగితో చేయించారని, ఉన్నతాధికారి ఒత్తిడి వల్ల ఒకరి విధులు మరొకరు చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆసుపత్రి అధికారులు సైతం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని వెల్లడించారు.

మాచర్ల-విజయవాడ ప్యాసింజర్ రైలువేళల్లో మార్పు

మాచర్ల: మాచర్ల నుంచి విజయవాడ(రైలు నంబర్ 67228) ప్యాసింజర్ రైలు వేళల్లో మార్పు చేసినట్లు రైల్వే శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైలు మాచర్లలో ఉదయం 6 గంటలకు బయల్దేరి 8:30 గంటలకు గుంటూరు చేరుతుందని, 10:55 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. తిరిగి విజయవాడలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి మాచర్ల రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.